కాకతీయ కళాతోరణం లేని రాజముద్రతో గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఎదుట అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

రాజముద్రలో కాకతీయ కళాతోరణం ఔట్!

వరంగల్, ఆగస్టు 26 (నమస్తేతెలంగాణ ప్రతినిధి) : రాజముద్రను అధికారులు ఇష్టారీతిగా వినియోగిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని తక్కువ చేసేలా రాజముద్రలో మార్పులు చేసే ప్రతిపాదన ముందుకు తెచ్చింది. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గింది. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు మాత్రం అత్యుత్సాహం చూపి రాజముద్రను మార్చారు. ఎల్ఆర్ఎస్‌పై సందేహాల నివృత్తి కోసం ప్రభుత్వం అన్ని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో సోమవారం హెల్ప్ డెస్క్ బ్యానర్ ఏర్పాటు చేశారు. ఇందులో తెలంగాణ రాజముద్ర మార్చేశారు. అధికారిక రాజముద్ర కాకుండా కొత్తగా చేసి పెట్టారు. అధికారులు రాజముద్రను మార్చడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం వరంగల్ చారిత్రక గొప్పదనాన్ని తెలిపేలా రాజముద్రలో కాకతీయ కళాతోరణాన్ని పెడితే, మున్సిపల్ కార్పొరేషన్ విరుద్ధంగా వ్యవహరించిందని విమర్శిస్తున్నారు. వరంగల్ నగర ఔన్నత్యాన్ని తగ్గించేలా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

డాక్టర్ రఘురామ్‌కు ప్రతిష్టాత్మక ఐఎస్ఎస్ ఫెలోషిప్

దరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణకు చెందిన ప్రముఖ సర్జన్ డాక్టర్ పిళ్లరిశెట్టి రఘురామ్ అంతర్జాతీయ శస్త్రచికిత్స సమాఖ్య (ఐఎస్ఎస్) ఫెలోషిప్‌ను మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో జరుగుతున్న 'వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ సర్జరీ' 50వ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘురామ్ మాట్లాడుతూ ట్రస్ట్ శస్త్రచికిత్స విధానంలో తన బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. గౌరవాన్ని తన తల్లికి, మాతృదేశానికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్‌లోని కిమ్స్‌లో డాక్టర్ రఘురామ్ పనిచేస్తున్నారు. దీన్ని స్వీకరించిన ఏకైక భారతీయుడిగా, భారత ఉపఖండంలోనే పిన్న వయస్కుడిగా ఆయన నిలిచారు.

ఎల్ ఆర్ ఎస్‌పై నాడు ఫ్రీ.. నేడు ఫీజులా?

- ముఖ్యమంత్రి రేవంత్‌కు హరీశ్‌రావు బహిరంగ లేఖ
- ప్రభుత్వ మెడలు వంచి ఉచితం చేయించే బాధ్యత బీఆర్ఎస్‌ది
- ప్రజలు ఒక్క రూపాయి కూడా కట్టొద్దు: మాజీ మంత్రి హరీశ్

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం లే అవుట్ క్రమబద్ధీకరణ (ఎల్ఆర్ఎస్)ను ఉచితంగా అమలు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రుణమాఫీ కాక, రైతు బంధు రాక రైతన్నలు ఆవేదన చెందుతుంటే.. విషజ్వరాలతో సామాన్యులు అల్లాడుతుంటే.. ప్రభుత్వం మాత్రం ఎల్ఆర్ఎస్ ఫీజులు వసూలు చేయాలని కలెక్టర్ నుంచి పంచాయతీ సెక్రటరీ వరకు ఉన్న యంత్రాంగంపై ఒత్తిడి చేయటం అన్యాయమని అన్నారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితం చేయాలని కోరుతూ ఆయన సీఎం రేవంత్‌కు బహిరంగ లేఖ రాశారు. ఆ లేఖలో.. పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు రోజుకు మూడు, నాలుగు సార్లు ఫోన్ చేసి ప్రజలను వేధిస్తున్నారని, ఫీజులు చెల్లించకుంటే లే అవుట్లు రద్దు చేస్తామంటూ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. డిమాండ్ నోటీసులు ఇస్తూ, టార్గెట్లు పెట్టి రూ.15 వేల కోట్లు వసూళ్లు చేయాలని ఆదేశాలివ్వటం అంటే ప్రజల రక్తమాంసాలను పీల్చడమేనని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టంచేశారు. ఆనాడు ఎల్ఆర్ఎస్ అంటే దోపిడీ అని.. ఇప్పుడు ప్రజలను దోపిడీ ఎందుకు చేస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్‌చేశారు. నాడు ఫ్రీ ఫ్రీ ఫ్రీ అని, నేడు ఫీజు ఫీజు ఫీజు అంటున్నారని.. ఓడ దాటే దాక ఓడ మల్లన్న, ఓడ దాటినంక బోడి మల్లన్న చందంగా కాంగ్రెస్ వైఖరి తేటతెల్లమవుతున్నదని ధ్వజమెత్తారు. 'అపుడు ఎల్ఆర్ఎస్‌కు ఫీజు వద్దన్న మీరు ఇప్పుడు అధికారంలోకి రాగానే అదే ఎల్ఆర్ఎస్‌తో దందా చేస్తున్నారా? అప్పుడు కట్టొద్దని ఇప్పుడు కాటు వేస్తారా? స్వయంగా మీతో సహా ప్రస్తుతం మీ క్యాబినెట్లో సహచరులుగా ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వంటి నేతల మాటలను మీకు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నా' అని లేఖలో పేర్కొన్నారు.

1. **ఉత్తమ్‌కుమార్‌రెడ్డి:** నో ఎల్ఆర్ఎస్- నో బీఆర్ఎస్, మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఒక్క రూపాయి తీసుకోకుండా ఉచితంగా ఎల్ఆర్ఎస్ అమలు చేస్తాం.
2. **భట్టి విక్రమార్క:** రక్తాన్ని పీల్చాలన్న ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నది. వీలైతే కట్టకండి. అప్పుల భారాన్ని ఎల్ఆర్ఎస్ రూపంలో ప్రజల మీద వేస్తున్నారు.
3. **సీతక్క:** ఎల్ఆర్ఎస్ పేరుతో దోచుకోవడానికి, దాచుకోవడానికి ప్రజల దగ్గర చిల్లిగవ్వ లేకుండా చేయడానికి కొత్త నాటకం.
4. **రేవంత్‌రెడ్డి:** బీఆర్ఎస్ అయిపోయింది. ఎల్ఆర్ఎస్ అయిపోయింది. ఎంఆర్ఎస్ తెస్తడట. ఎంఆర్ఎస్ అంటే మ్యారేజ్ రెగ్యులరైజేషన్ స్కీం కూడా తీసుకొస్తుందేమో.

ఇవి మాత్రమే కాదు, ఎల్ఆర్ఎస్ రద్దు చేయాలంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఏకంగా హైకోర్టుకు వెళ్లారని హరీశ్‌రావు గుర్తు చేశారు. పిల్ దాఖలు చేశారని, ఎన్నికల్లో గెలిచేందుకు ప్రజలను మభ్యపెట్టి రెచ్చగొట్టేలా బహిరంగ సభల్లో ఊదరగొట్టారని, ఎన్నికలు పూర్తికాగానే మాట మార్చి ఎల్ఆర్ఎస్‌పై ఫీజులు వసూలు చేయాలని నిర్ణయం తీసుకోవడం రెండు నాల్కల ధోరణికి అద్దం పడుతుందని విమర్శించారు. ప్రజాపాలన అని డబ్బాకొట్టుకుంటున్న మీకు 25.44 లక్షల దరఖాస్తుదారుల కుటుంబాల ఆవేదన కనిపించటం లేదా? ఇప్పటికైనా కండ్లు తెరిచి హామీ ప్రకారం పూర్తి ఉచితంగా ఎల్ఆర్ఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాట తప్పిన ప్రభుత్వానికి చెంపపెట్టుగా ఏ ఒక్కరూ ఒక్క రూపాయి ఎల్ఆర్ఎస్ ఫీజు కూడా చెల్లించవద్దని రాష్ట్ర ప్రజలకు పిలుపునిస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయించే బాధ్యత బీఆర్ఎస్ తీసుకుంటుందని తేల్చిచెప్పారు.

ఇండిపెండెంట్ జర్నలిస్టులకు రక్షణేది?

- రాహుల్‌గాంధీ మీరైనా ముఖ్యమంత్రికి చెప్పండి
- ప్రజల కోసం పనిచేస్తే దాడులా?
- వాస్తవాలను వెలికితీసే వారిపై కక్ష ఎందుకు?
- తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని కాపాడండి
- ఢిల్లీలోని రాహుల్ ఇంటి వద్ద జర్నలిస్టుల నిరసన

ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇంటి ఎదుట నిరసన తెలుపుతున్న స్వతంత్ర జర్నలిస్టులు

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఇండిపెండెంట్ జర్నలిస్టులు, మీడియా సంస్థలు స్వేచ్ఛగా పనిచేసే పరిస్థితి లేదని ఇండిపెంటెండ్ జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవాలను ప్రజల మందుంచుతున్న ఆఫీసుల ముందు నయీం గ్యాంగ్‌లతో పహారా కాయిస్తున్నారని, ఏ క్షణం దాడులు చేస్తారో తెలియక బిక్కుబిక్కుమంటున్నామని, ఈ దారుణ పరిస్థితిపై రాహుల్‌గాంధీ వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం ఢిల్లీలోని రాహుల్‌గాంధీ ఇల్లు, ఏఐసీసీ కార్యాలయం వద్ద వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా స్వతంత్ర జర్నలిస్టు శంకర్ మాట్లాడుతూ.. రుణమాఫీపై గ్రౌండ్ రిపోర్టు తీసుకొని.. ఉన్నది ఉన్నట్టు చెప్పే ప్రయత్నం చేస్తున్న క్రమంలోనే తమపై దాడులకు ప్రేరేపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ దొరక్కపోవటంతో ఇల్లు, ఏఐసీసీ కార్యాలయం వద్ద ఆందోళనల చేపట్టినట్టు తెలిపారు. సీఎం సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో రుణమాఫీ జరిగిందా? లేదా? అని తెలుసుకునేందుకు వెళ్లిన మహిళా జర్నలిస్టులపై, తమపై దాడికి తెగబడ్డారని, 30 కిలోమీటర్ల మేర 150 కిలోమీటర్ల వేగంతో కార్లతో వెంబడించి భయభ్రాంతులకు గురిచేశారని వివరించారు. వెల్దండి పీఎస్‌కు వెళ్లి ప్రాణాలు కాపాడుకున్నట్టు వెల్లడించారు. గతంతో ఫిబ్రవరి 22న కూడా తమపై దాడి చేశారని, ఇటీవల ఓయూలో జీ తెలుగు జర్నలిస్టులు, ఇండిపెండింట్‌గా ఉన్న చిలుక ప్రవీణ్, ఆకుల శ్రీనివాస్‌రెడ్డి, సరిత, విజయారెడ్డి వంటి వారిపైనా దాడులకు తెగబడ్డారని తెలిపారు.

రాష్ట్రంలో పరిస్థితి బాగోలేదు

ప్రజలకు వాస్తవాలు చెప్పేందుకు ప్రయత్నం చేస్తున్నాం కాబట్టే దాడులు చేస్తున్నారని జర్నలిస్టు సుంకరి ప్రవీణ్ తెలిపారు. తెలంగాణలో స్వతంత్ర జర్నలిస్టుల పరిస్థితి దారుణంగా ఉంది కాబట్టే.. ఢిల్లీ వరకు రావాల్సి వచ్చిందన్నారు. ఏ పెద్ద పనికైనా సీఎం రేవంత్‌రెడ్డి అధిష్ఠానంతో మాట్లాడేందుకు ఢిల్లీకి వస్తున్నారని, అందుకే సమస్యలు చెప్పుకునేందుకు తాము కూడా ఢిల్లీకి వచ్చినట్టు చెప్పారు. వార్తల కోసం వెళ్లిన వారిపై దాడులు చేస్తూ.. వారి ఆఫీసుల చుట్టూ రెక్కీ చేయటం దారుణమని అన్నారు. తామంతా గతంలోని మెయిన్‌స్ట్రీమ్ మీడియా సంస్థల్లో పనిచేసిన వారిమేనని చెప్పారు. మిస్ లీడింగ్ వార్తలు రాస్తే తమపై కేసులు పెట్టుకోవచ్చని ఇండిపెండెంట్ జర్నలిస్టు ప్రభాకర్ చెప్పారు. రాహుల్ తెలంగాణకు వచ్చి వీధుల్లో ప్రేమను పంచుతామని చెప్పినా.. ఆ పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం కుటుంబసభ్యులే దాడులు చేయడంతో అధిష్ఠానానికి చెప్పేందుకు ఢిల్లీ వచ్చినట్టు వివరించారు.

వినతిపత్రాలు తీసుకోని రాహుల్ ఆఫీస్

'సేవ్ తెలంగాణ జర్నలిస్టు' అంటూ ఢిల్లీ వరకు వెళ్లి ఏఐసీసీ, రాహుల్‌గాంధీ కార్యాలయాల్లో వినతి పత్రం ఇచ్చేందుకు ప్రయత్నించినా.. తీసుకునేందుకు సిబ్బంది నిరాకరించినట్టు ఇండిపెండెంట్ జర్నలిస్టులు తెలిపారు. దీంతో జంతర్‌మంతర్ వద్దకు వచ్చి నిరసన తెలిపారు. ఆ తర్వాత రాష్ట్రపతి, పీఎం కార్యాలయాల్లో మెమొరాండం ఇచ్చారు. తెలంగాణలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులపై అధికారులకు వివరణ ఇచ్చారు. తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. ముఖ్యంగా సీఎం రేవంత్‌రెడ్డి బంధువుల ఆగడాలు ఆపాలని, దాడులు, కక్షపూరిత చర్యలు మానుకొనే చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఇప్పటికే రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేశామని, వారి ద్వారా తమకు రక్షణ కల్పించే ఏర్పాట్లు చేయాలని రాష్ట్రపతి, పీఎం కార్యాలయ అధికారులకు విన్నవించారు. నిరసనలో ఇండిపెండెంట్ జర్నలిస్టులు లింగస్వామి, ఆకుల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

20% డిపాజిట్‌పై మినహాయింపు ఇవ్వండి

- భవన నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి పిటిషన్

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): ఆదాయ పన్నులో మినహాయింపు ఇస్తూ గతంలో ఐటీ శాఖ ఇచ్చిన ఉత్తర్వులకు విరుద్ధంగా ఇప్పుడు నోటీసులు, పన్ను మదింపు ఉత్తర్వులు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ మండలి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ ఎన్ రాజేశ్వరరావు ధర్మాసనం ఇటీవల విచారణ జరిపింది. కార్మికుల సంక్షేమ చట్టం కింద 2008లో ఈ మండలి ఏర్పాటైందని పిటిషనర్ తరపు న్యాయవాది గుర్తు చేశారు. వీటి అమలుపై స్టే ఇచ్చేందుకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు నిరాకరించడంతో పాటు మదించిన ఆదాయపన్ను మొత్తంలో 20 శాతం డిపాజిట్ చేయాలని షరతు విధించిందని చెప్పారు. డిపాజిట్‌పై మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఈ వ్యవహారంపై కౌంటర్ దాఖలు చేయాలని ఐటీ శాఖకు నోటీసు జారీచేసిన హైకోర్టు తదుపరి విచారణ 28కి వాయిదా వేసింది.

డెంగ్యూతో బాలిక మృతి

ధర్మసాగర్, ఆగస్టు 26 : డెంగ్యూ జ్వరంతో బాలిక మృతి చెందిన ఘటన హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు పెసరు స్వామి కూతురు ప్రవళిక (11)కు నాలుగు రోజుల క్రితం జ్వరం వచ్చింది. చికిత్స నిమిత్తం హనుమకొండలోని ఓ దవాఖానకు తీసుకెళ్లగా వైద్యులు డెంగ్యూ అని నిర్ధారించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తమ్ముడు కూడా జ్వరంతో బాధపడుతున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. గ్రామంలో చాలామందికి విషజ్వరాలు వస్తున్నాయని, వైద్యాధికారులు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చెయ్యే.. ఫ్లూయిడ్ స్టాండ్

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 26: ఎంజీఎం దవాఖానలో ఫ్లూయిడ్ హ్యాంగర్స్ లేకపోవడంతో రోగులు, అటెండెంట్లు ఇబ్బందులు పడిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. ఓ రోగిని కుర్చీలో కూర్చోబెట్టి సెలైన్ బాటిల్‌ను అటెండెంట్ చేతికివ్వడంతో అది ఎక్కే వరకు ఆమె అలాగే పట్టుకుని నిలబడింది. అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు.

సిద్దిపేట ప్రభుత్వ జనరల్ దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులు; మహబూబాబాద్ జిల్లా కొత్తతండాలో ఇంటి వద్దే చికిత్స చేయించుకుంటున్న వృద్ధురాలు

ఇంటికి ఇద్దరికి విషజ్వరం

మొదటిపేజీ తరువాయి...

అందిస్తుండగా నగరంలోని కొన్ని కార్పొరేట్ దవాఖానలు 'మా హాస్పిటల్‌లో బెడ్స్ ఖాళీగా లేవు. వేరే హాస్పిటల్‌కు వెళ్లండి' అని గేటు నుంచే వెనక్కి పంపుతున్నాయంటే పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. 'మేం సర్వే చేస్తున్నప్పుడు ప్రతి పది మందిలో కనీసం ముగ్గురు, నలుగురు జ్వరం ఉన్నట్టు చెప్తున్నారు' అని ఆరోగ్య సిబ్బంది వెల్లడిస్తున్నారు. అంటే ప్రతి ఇంట్లోనూ జ్వర బాధితులు కనిపిస్తున్నారు. మరోవైపు దవాఖానల్లో మందుల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ (సీడీఎస్)లో నిల్వలు అడుగంటాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

ఒకే అధికారి, ఒకే రోజు రెండు తీర్ల లెక్కలు

డెంగ్యూ కేసుల లెక్కల్లో ప్రభుత్వం ప్రకటిస్తున్నదానికి, వాస్తవ పరిస్థితులకు భారీ వ్యత్యాసం ఉన్నదని మొదటి నుంచీ ఆరోపణలున్నాయి. దీన్ని నిజం చేస్తూ డీపీహెచ్ రవీందర్ నాయక్ ఒకేరోజు విడుదల చేసిన లెక్కల్లో తీవ్ర వ్యత్యాసం కనిపిస్తున్నది.

- 'నమస్తే తెలంగాణ'లో ఈ నెల 23న ప్రచురితమైన 'పడకేసిన ప్రజారోగ్యం' అనే వార్తకు డీపీహెచ్ ఈ నెల 24 వివరణ ఇచ్చారు. ఈ నెల 23 నాటికి రాష్ట్రంలో ఒక్క డెంగ్యూ మరణం నమోదు కాలేదని పేర్కొన్నారు. మొత్తం 4,459 డెంగ్యూ కేసులు నమోదైనట్టు తెలిపారు. మొత్తం 63,532 మందికి టెస్టులు నిర్వహించినట్టు చెప్పారు. కానీ ఈ నెల 24న డీపీహెచ్ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రాష్ట్రంలో ఆగస్టు 21 నాటికి 4,648 డెంగ్యూ కేసులు నమోదైనట్టు చెప్పారు. 66,589 టెస్టులు చేసినట్టు వెల్లడించారు.
- వాస్తవానికి 21 నుంచి 23 వరకే కేసుల సంఖ్య, టెస్టుల సంఖ్య పెరగాల్సింది పోయి తగ్గింది. 189 కేసులు తగ్గగా, టెస్టుల సంఖ్య తగ్గినట్టు చెప్తున్నారు. చేసిన టెస్టుల సంఖ్య 3057 తక్కువగా చూపారు.
- ఇదే తరహా జ్వరసర్వేలోనూ తప్పుడు వివరాలు వెల్లడిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సోమవారం నాటికి రాష్ట్రంలో 2,65,324 జ్వర కేసులు నమోదైనట్టు డీపీహెచ్ ప్రకటన విడుదల చేశారు. సర్వే సమయంలో జ్వర లక్షణాలున్నవారికి అక్కడే పారాసిటమాల్ వంటి ట్యాబ్లెట్లు ఇస్తున్నారని, తీవ్రంగా ఉన్నవారిని మాత్రమే పీహెచ్‌సీకి పంపతున్నారని చెప్పారు. పీహెచ్‌సీ, ఫైదవాఖానలకు వెళ్లినవారి లెక్కలు మాత్రమే అధికారికంగా నమోదు చేస్తున్నారని సమాచారం. అందుకే సంఖ్య తక్కువగా కనిపిస్తున్నదనే ఆరోపణలున్నాయి.

వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని ఏజెన్సీ గ్రామమైన కొండాపూర్‌లో వైద్య సాయం అందక మంచం పట్టిన ఓ వృద్ధురాలు

డెంగ్యూ మరణాల్లేవు : వైద్యశాఖ

రాష్ట్రంలో ఈ నెల 23 నాటికి ఒక్క డెంగ్యూ మరణం కూడా నమోదు కాలేదని వైద్య,ఆరోగ్య శాఖ తెలిపింది. ఈ నెల 23న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'పడకేసిన ప్రజారోగ్యం' కథనానికి వైద్యశాఖ వివరణ ఇచ్చింది. కథనంలో పేర్కొన్న 8 మరణాలు కూడా డెంగ్యూకు సంబంధించినవి కావని, ఇతర కారణాలతోనే రోగులు మరణించారని పేర్కొన్నది. సీజనల్ వ్యాధుల నియంత్రణకు ఈ ఏడాది మే నుంచే చర్యలు చేపట్టామని, నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, వ్యాధులు, దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఉన్నతాధికారుల బృందం రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నదని తెలిపారు.

వేధిస్తున్న మందుల కొరత

రాష్ట్రవ్యాప్తంగా పీహెచ్‌సీల నుంచి టీచింగ్ వైద్యశాలల వరకు మందుల కొరత ఉన్నట్టు వైద్యసిబ్బంది చెప్తున్నారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి దవాఖానలకు మందులు సరఫరా అవుతుంటాయి. కానీ, ఈ నెల 23 నాటికి సీడీఎస్‌లోనే 31 రకాల ట్యాబ్లెట్లు, 19 రకాల ఇంజిక్షన్లు, 11 సర్జికల్ ఐటమ్స్, 21 రకాల సిరప్‌లు లేవని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రధానంగా జ్వర బాధితులు, ఇతర రోగులకు దవాఖానల్లో అందించే చికిత్సలో వాడే మందులు కూడా కరువయ్యాయని చెప్తున్నారు. దీంతో దవాఖానల నుంచి ఇండెంట్లు వచ్చినా సరఫరా చేయలేక చేతులెత్తేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నాళ్లుగా బఫర్ స్టాక్‌తో నెట్టుకొచ్చామని, అది కూడా అడుగంటిందని అంటున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దవాఖానల్లో 40 శాతం వరకు మందుల కొరత ఉన్నట్టు చెప్తున్నారు. 'సూపరింటెండెంట్ల ఖాతాలో ఉన్న ఆరోగ్యశ్రీ నిధుల నుంచి నెట్టుకొస్తున్నాం. అత్యవసర మందులు, పరికరాలు కొనుగోలు చేస్తున్నాం. అయినా కొరత తీరడం లేదు' అని ఓ సూపరింటెండెంట్ పేర్కొన్నారు. టీజీఎంఎస్ ఐడీసీకి మందులు సరఫరా చేసే సరఫరాదారులు, డీలర్లకు ప్రభుత్వం సుమారు రూ.600 కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టినట్టు సమాచారం. అందుకే వారు సరఫరా నిలిపివేశారని చెప్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, మందులు సరఫరా చేయాలని కోరుతున్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

రాష్ట్రంలో డెంగ్యూతో ప్రజలు చనిపోతున్నారు: కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డెంగ్యూ మరణాలే లేవని ప్రభుత్వం చెప్తున్నదని, మరో వైపు పత్రికల్లో డెంగ్యూతో ప్రజలు చనిపోతున్నారని రోజూ వార్తలు వస్తున్నాయని సోమవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. రెండు రోజుల క్రితమే డెంగ్యూ కారణంగా ఐదుగురు చనిపోయారని వార్తలు వచ్చాయని తెలిపారు. ఆదివారం కూడా మరో ముగ్గురు చనిపోయినట్టు వార్తలు చూశానని, మరి నిజాల్ని ప్రభుత్వం ఎందుకు దాచిపెడుతున్నదని ప్రశ్నించారు. దవాఖానల్లో సరిపడా మందులు కూడా లేవని పేర్కొన్నారు. ఒకే బెడ్ పై ముగ్గురు నుంచి నలుగురికి వైద్యం అందిస్తున్న పరిస్థితి ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం డెంగ్యూ సమస్య తీవ్రంగా ఉందని అంగీకరించి వెంటనే రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని కోరారు.

పిల్లలకు కుళ్లినా గుడ్డా...?

రాష్ట్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు కుళ్లిన గుడ్లను అందించడంపై కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. శరత్‌రెడ్డి అనే ఎక్స్ యూజర్ సోమవారం కేటీఆర్‌ను ట్యాగ్ చేస్తూ భువనగిరిలోని పెద్దవాడ సమ్మద్ చౌరస్తా అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆహారంగా కుళ్లిన గుడ్లు అందిస్తున్నట్టు పేర్కొన్నాడు. దీనిపై స్పందించిన కేటీఆర్ ఇది చాలా దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పసిపిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నదని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే ఈ సమస్యపై దృష్టి పెట్టాలని కోరారు.

సర్దార్ నగర్‌లో ఉన్న తుమ్మల చెరువు కన్పించడంలేదని పహాడీషరీఫ్ పోలీసులకు వినతిపత్రం ఇస్తున్న అందెల శ్రీరాములుయాదవ్

తుమ్మల చెరువు మిస్సింగ్!

- 8 ఎకరాల్లో మాయం అయింది
- కాస్త వెతికి పెట్టండి సారూ
- పోలీసులకు బీజేపీ నేతల ఫిర్యాదు

బడంగ్‌పేట, ఆగస్టు26: 'అలుగు ఉంది.. కానీ చెరువు ఆనవాళ్లు మచ్చుకైనా కనిపించడం లేదు. కాస్త వెతికిపెట్టండి సారూ' అంటూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని సర్దార్‌నగర్ రెవన్యూపరిధిలో 8ఎకరాల్లో ఉండే తుమ్మల చెరువు కనిపించడం లేదని పహాడీషరీఫ్ పోలీసులను ఆశ్రయించారు. చెరువు ఎక్కడ ఉందో కనిపించడంలేదని.. చెరువు అలుగు మాత్రమే కనిపిస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో తుమ్మల చెరువు కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేయడం హాట్‌టాపిక్‌గా మారింది. ఈ సందర్భంగా అందెల శ్రీరాములు మాట్లాడుతూ మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తాళ్లచెరువు నామరూపాల్లేవని, జల్‌పల్లిలో పెద్దచెరువు భూములను నోటరీలు చేసి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. చెరువుల్లోని భూములను విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. హైడ్రా పేరుతో డ్రామాలు చేయకుండా నిజాయితీగా చెరువులను చెరబట్టిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.